క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సువర్ణల సునియం

పెద్దకడబూరు: స్థానిక ఎమ్మార్సీ వద్ద పీఆర్‌టీయూ(ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) 2023 క్యాలెండర్, డైరీలను బుధవారం ఎంఈఓ సువర్ణల సునియం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అర్థమయ్యే రీతిలో బోధన చేసి విద్యార్థుల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యారా తారీఖ్

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గ్యారతారీఖ్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం చదివింపులు, నాతేషరీఫ్‌లు, సలాముల ఆలాపన చేశారు.

ఓపీ కౌంటర్లు పెంచాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచాలని సీపీఎం నాయకులు మహానందరెడ్డి, లక్ష్మన్న, తిప్పన్న, వెంకటేశులు, ఇగ్బాల్ తదితరులు బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులు ఓపీ రిజిస్ట్రేషన్ కోసం వరుసలో గంటల కొద్దీ నిలబడలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కౌంటర్‌లు పెంచాలని విన్నవించారు.

బీమా చెక్కు పంపిణీ



మృతురాలి కుమారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

కోసిగి: మండల కేంద్రంలోని బుడగజంగాల యల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుమారుడికి వైఎస్సార్ బీమా చెక్కు మంజూరైంది. పంచాయతీ కార్యదర్శి అనురాధ సమక్షంలో రూ.లక్ష చెక్కును వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, హొళగుంద కోసిగయ్య, బుడగజంగాల అయ్యప్ప, బసిరెడ్డి పాల్గొన్నారు.

ధణాపురం పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

ఆదోని అర్బన్: మండలంలోని ధణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఆదోని ఉప ఖజానాధికారి వెంకటరమణ ఉన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

ఆదోని రూరల్: స్థానిక భీమా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేంద్ర బాబు మాట్లాడుతూ త్వరలో నంద్యాల పాలిటెక్నిక్ కాలేజీలో త్వరలో జరగబోయే క్రీడల్లో తమ కళాశాల నుంచి 41 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

వడ్డెరుల సంక్షేమానికి కృషి

ఆదోని అర్బన్: వడ్డెరుల సంక్షేమానికి కృషి చేస్తానని అఖిలభారత వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షుడికి ఎంపిక చేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కులస్తుల సంక్షేమానికి పాటుపడతానని చెప్పారు.

అర్హులందరికీ పింఛన్ ప్రభుత్వ ధ్యేయం



కొత్త పింఛన్‌దారులకు పింఛన్‌లను అందజేస్తున్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: అర్హులందరికీ పింఛన్ అందజేయడమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణం, మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ముతో పాటు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పెంచుతూ వెళ్తున్నారన్నారు. మూడున్నరేళ్లలో మూడు సార్లు పెంచి అవ్వతాతలకు అలఅండగా నిలిచారన్నారు. అనర్హులను తొలగించి అర్హులందరికీ పింఛన్ మంజూరు చేస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులై ఉండి పింఛన్ మంజూరు కానివారెవరైనా ఉంటే వలంటీర్లను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో తొలగించిన పింఛన్లను సైతం పూర్తిస్థాయిలో విచారించి అర్హులైతే కచ్చితంగా పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

బాబు ఆర్భాటాలకు పేదలు బలి

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుకు ప్రచార ఆర్భాటం తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచన లేదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. బాబు ప్రచార ఆర్భాటాలకు పేదలు బలి అవుతున్నారన్నారు. సీఎంగా ఉన్నప్పుడు పుష్కరాల్లో 39 మందిని బలిగొన్న చంద్రబాబునాయుడు కందుకూరు గ్రామంలో ఇరుకు రోడ్డులో సమావేశం నిర్వహించి 8 మందిని బలి తీసుకున్నారని, గుంటూరు జిల్లాలో చంద్రన్న కానుకల పేరుతో చీరల పంపిణీ కార్యక్రమం పెట్టి మరో ముగ్గురు మహిళలను బలిగొన్నారని విమర్శించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఈఓపీఆర్‌డీ జనార్దన్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, నాయకులు గురునాథ్‌రెడ్డి, శేషిరెడ్డి, నరసింహమూర్తి, రామలింగేశ్వరయాదవ్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు భూమిపూజ

ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న నెట్టేకల్ క్రాస్ రోడ్డు వద్ద నుంచి ఆస్పరి మీదుగా వెళ్లే 167 జాతీయ రహదారిని కలుపుతూ చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి బుధవారం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో నేషనల్ హైవే ఉన్నతాధికారులు, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్‌లు, నాయకులు ధర్మన్న, ఎస్‌ఎండీ బాషా, నరసింహమూర్తి, తిమ్మప్ప, మహ్మద్‌బాషా, నారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకి, బోయగేరికి చెందిన 20 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు అంజి, తిమ్మప్ప, లాలప్ప, నాగిరెడ్డి, ఉదయ్‌కుమార్, వెంకటేష్, చిన్నరంగన్న, శీను, మద్దిలేటి, శివ, పెద్దరంగన్న, అశోక్ తదితరులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవా, నాయకులు హరి, వెంకప్ప, ప్రతాప్, చిన్నఈరప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

భూహక్కు పత్రాలు తీసుకెళ్లండి

మంత్రాలయం రూరల్: భూహక్కు పత్రాలు తీసుకెళ్లాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాచాపురం, పరమాన్‌దొడ్డి, ఖగ్గల్ గ్రామాల్లోని రైతులకు జగనన్న భూ హక్కు, భూరక్ష పథకం కింద పత్రాలు మంజూరయ్యాయన్నారు. రెవెన్యూ అధికారిని సంప్రదించి తీసుకెళ్లాలని, వాటిలో ఏవైనా తప్పులు ఉంటే ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

కోసిగి: పంట పొలాల రీసర్వే పూర్తి చేయించుకుని జగనన్న భూ హక్కు పత్రాలు మంజూరైన రైతులు తప్పనిసరిగా వలంటీర్ల లాగిన్‌లో ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కలువలగుండు, యండపల్లి, వందగల్లు, పుట్టకుంట, పెండేకల్లు, పల్లెపాడు, గ్రామాల పొలాల సర్వే పూర్తయ్యిందన్నారు. ఆయా గ్రామాల రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలు మంజూరయ్యాయని, వలంటీర్లను కలిసి ముందుగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు.

భూ హక్కు పత్రాల్లో తప్పులు సరిచేసుకోండి

కౌతాళం: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే అయి పత్రాలు పొందిన రైతులు అందులో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శాశ్వత హక్కు పత్రాల్లో తప్పులుంటే అర్జీ పెట్టుకోవాలని, ఏడాదిలోపు సవరణ చేసి పత్రాలు అందజేస్తామన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



మంత్రి గుమ్మనూరు జయరాంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్

ఆలూరు: కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక మంత్రి నివాసంలో బుధవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌బాబు, సహాయ అధికారులు కనకలక్ష్మి, వెంకటరాముడు, కేశన్న తదితరులు మంత్రిని మర్యాదపూర్వకగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. బాల కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గౌండ, కుట్టు, తాపీ మేస్త్రీలు, టైలర్లు, పెయింటర్లు, తదితర కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్లకు చెందిన రెవెన్యూ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్‌ఈఈ, డీఈలు, ఎంపీడీఓ, తహసీల్దార్లు, వ్యవసాయశాఖ ఏడీఏలు,విద్యుత్‌శాఖ ఈఈ, డీఈఈ, హెచ్ ఎల్ఎల్సీ, ఎల్ఎల్సీ, తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు మంత్రిని కలిశారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ట్యాబ్‌ల పంపిణీ

కౌతాళం: మండల పరిధిలోని బాపురం ఉన్నత పాఠశాలలో బుధవారం 59 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథ్‌రెడ్డి, హెచ్‌ఎం స్వల్న, ఉపాధ్యాయులు ఆనంద్, నాయకులు జైపాల్, శ్రీనివాసరెడ్డి, అయ్యప్ప, పామిరెడ్డి, నర్సిరెడ్డి, రాఘవరెడ్డి, వీరేశచారి పాల్గొన్నారు.

చిర్తనకల్లులో..

కోసిగి: మండల పరిధిలోని చిర్తనకల్లు ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈరన్న, హెచ్‌ఎం బద్రీనాథ్, నాయకులు విజయభాస్కర్, రామిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో సర్పంచ్ ఈరన్న

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



హొళగుంద జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హొళగుంద: జీవితంలో ఎదిగేందుకు 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. బుధవారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన, మాట మంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ధైర్యాన్ని నూరిపోస్తూ వారికి చదువుపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యే క దృష్టి సారించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను చదివించాలని ఆ దిశగా టీచర్లు ప్రణాళికతో ముందకెళ్లాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు, ఇతర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీచర్ల కొరత, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్, ఆదోని డీఎల్ డీఈఓ సుకుమార్, ఎంఈఓ ఈరన్న, హెచ్‌ఎంలు మల్లికార్జునగౌడ్, రంగన్న, కబీర్‌సాబ్, టీచర్లు పాల్గొన్నారు.

పొదుపు మహిళల జీవనోపాధి పెరగాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

ఎమ్మిగనూరు: మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, పొదుపు మహిళల జీవనోపాధులు పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఆదోని, ఎమ్మిగనూరు పురపాలక సంఘాలకు చెందిన పొదుపు సంఘాల ఆర్పీలు, మెప్మా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళల ఆర్థిక పరిపక్వతను పెంచేందుకు ఉద్దేశించిన మహిళా మార్ట్‌లను ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు విరివిగా బ్యాంకు రుణాలు ఇప్పించి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల పరిధిలో అమలైన సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఏఓలు నాగరాజు, ఐబి మురళి, ఎల్‌హెచ్ జిలానీబాషా, టీఎంసీ వెంకటేశ్వర్లు, సీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి.

మంత్రాలయం రూరల్: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ సచివాలయంలో మూడో రోజు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ముందుగా నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. స్థానికులు తమ సమస్యలను చెప్పుకోగా వెంటనే పరిష్కారించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు మంజూరైన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మజ్జిగ గోవిందమ్మ, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యులు నరసమ్మ, జయలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ వెంకోబా తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన సీఐ

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సీఐ భాస్కర్, ఎస్ఐ కిరణ్ బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ పడ్డొదని సూచించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సీఐ భాస్కర్, ఎస్ఐ కిరణ్

8న షూటింగ్ బాల్ బాలుర ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీ స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ అండర్–18 బాలుర విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు విజయవాడలో ఈ నెల 14న శాప్ లీగ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు కార్యదర్శి నాగరాజు 9000149695 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

7న ఎస్‌జీఎఫ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 7వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ –19 విభాగంలో పవర్ లిఫ్టింగ్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ సేవలపై దృష్టి సారించండి

ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే సేవలు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ మద్దమ్మతో పాటు పలువురు సూపర్‌వైజర్లు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా నియామకమైన సూపర్‌వైజర్లను సీడీపీఓ ఎమ్మెల్యేకు పరిచయం చేయించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

18 నుంచి ఉరుసు

తుగ్గలి: ఈనెల 18 నుంచి నల్లగుండ్లలో మునిస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు బుధవా రం గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18న గంధం, 19న ఉరుసు, 20న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉరుసు సందర్భంగా కబడ్డీ, వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 89195 88669, 63003 93085 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామం నుంచి రామదుర్గం వరకు 7.6 కి.మీ మేర రూ.11.40 కోట్లతో నిర్మించిన రోడ్డు నాణ్యతను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించారు. ఎస్ఈ శివకుమార్, డీఈ వెంకటేశ్వర రెడ్డి, ఈఈ గీతావాణి తదితరులు ఉన్నారు.



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వలంటీర్లకు అభినందన

ఆదోని అర్బన్: 'లీడ్ ద ఫ్యూచర్' వ్యక్తిత్వ వికాసం శిబిరంలో పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కళాశాల యాజమాన్యం బుధవారం అభినందించింది. గతనెల 20 నుంచి 31వ తేదీ వరకు ఐఏయూవైఎస్‌ఏ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్లలో జరిగిన వ్యక్తిత్వ వికాసం శిబిరంలో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారని కళాశాల చైర్మన్ విట్టా సతీష్, కరస్పాండెంట్ దైవాధీనంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జొనాథన్, ఎన్‌సీసీ అధికారి గోవిందు పాల్గొన్నారు.

విపత్తు రక్షణ చర్యలపై అవగాహన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం జాతీయ విపత్తు కమిటీ చైర్మన్ ప్రిన్సిపాల్ సాగరిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జయన్న, రూరల్ సీఐ మంజునాథ్, అగ్నిమాపక అధికారి రామాంజనేయులు హాజరయ్యారు. అగ్నిమాపక అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ అపార్ట్‌మెంట్స్, ఇతరచోట్ల ప్రమాదాలు, వరదలు వచ్చినప్పుడు అప్రమత్తతతో ఎదుర్కొని బయట పడవచ్చునని చెప్పారు. రూరల్ సీఐ మంజునాథ్ మాట్లాడుతూ భౌతికంగా సంభవించే విపత్తుల సమయాల్లో ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చునని, సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చే ప్రమాదాన్ని వివేకంతో ఎదుర్కోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని చెప్పారు.



డెమో ప్రదర్శిస్తున్న ఫైర్ ఎస్ఐ రామాంజనేయులు

అనంతరం అగ్నిమాపక పోలీసుల ఆధ్వర్యంలో విపత్తు సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అప్రమత్తతపై డెమో ప్రదర్శించారు. విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని స్థానిక 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ రమేష్ సూచించారు. నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు గత 34 రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన పోటీల్లో స్థానిక హైటెక్ లెవెన్ జట్టుపై ఎఫ్‌ఎం హోస్పెట్ లెవెన్ జట్టు గెలుపొందింది. ఈ జట్టులో ప్రతిభ చాటిన క్రీడాకారుడు పవర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రెండవ మ్యాచ్‌లో స్థానిక యంగ్ సహారా లెవెన్ జట్టుపై డేంజరస్ లెవెన్ జట్టు గెలుపొందింది. ఈ జట్టులో జయ అనే క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును టౌన్‌బ్యాంక్ చైర్మన్ యుకె రాజశేఖర్, కౌన్సిలర్ అమాన్ అందజేశారు. టోర్నీ నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సయ్యద్‌చాంద్, వడ్డె రంగన్న, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు విశ్వనాథ్ రమేష్

భూ హక్కు పత్రాల పంపిణీ

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తొలగించేందుకు జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకం ద్వారా రీసర్వే చేపట్టిందని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామంలో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మిట్టసోమపురం, ఇబ్రహీంపురం, పూలచింత, మాచాపురం గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తయ్యిందన్నారు. రైతులకు సంబంధించిన భూ హక్కు పత్రాలు (టైటిల్ డీడ్) ఆయా గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకోవాలని కోరారు.